ప్రజాశక్తి
బుధవారం 11 డిసెంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు



డుంబ్రిగుడలో శునకాల స్వైర విహారం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండల కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని 516ఈ హైవే రోడ్డులో నిరంతరం రాత్రి, పగలు గుంపులు గుంపులుగా ఉంటుండడంతో స్థానికులతో పాటు ఈ రోడ్డు గుండా ప్రయాణించే వాహనదారులు కూడా పలు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో చిన్న పిల్లలపై కుక్కలు దాడి చేసిన సంఘటనలు ఉన్నాయి. వాహనదారులు ప్రయాణించేటప్పుడు అకస్మాత్తుగా కుక్కలు వాహనాలకు అడ్డుగా రావడంతో ద్విచక్ర వాహనదారులు యాక్సిడెంట్లకు కూడా గురైన సంఘటనలు ఉన్నాయి.



సంచరిస్తున్న శునకాలు

కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలి

-ఎమ్మెల్సీ రవిబాబు, ఎమ్మెల్యే మత్స్యలింగం



మాట్లాడుతున్న రవిబాబు, మత్స్యలింగం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 13న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు రైతులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తామని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలకు దగా చేస్తుందని, సూపర్ సిక్స్ ఎన్నికల హామీలపై జిల్లా కలెక్టర్లకు విజ్ఞాపన వినతి పత్రాలు జిల్లా కలెక్టర్లకు అందజేస్తామని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మంగళవారం అరకులోయ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ప్రకారం రైతులకు పెట్టుబడి సాయం ఏడాదికి 20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. రైతులు పండిస్తున్న ధాన్యాలు కనీసం మద్దతు ధర ప్రకటించి దళారి వ్యవస్థను అరికట్టలన్నారు. వర్షానికి తడిసిన పాడైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం రైతులకు ఇబ్బంది పెట్టకూడదని తెలిపారు. ఉచిత పంట భీమను పునరుద్ధరించాలని, రైతులపై అదనపు భారము మోపి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పెంచిన కరెంటు బిల్లు తక్షణమే తగ్గించాలని, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర ఎస్టి సెల్ కార్యదర్శి పాంగి చిన్నారావు, అరకులోయ టౌన్ షిప్ ఎంపీటీసీ సమర్డి శత్రుగుణ, అరకులోయ వైసిపి నేత కమ్మిడి అశోక్, మండల వైసీపీ నాయకులు ఎం.బాలరాజు, నాగేష్, రామ్ మూర్తి, గోపాల్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి

జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి: నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యం పట్ల పాఠశాల యాజమాన్యం శ్రద్ధ చూపాలని,. రుచికరమైన భోజనం పెట్టాలని స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు సూచించారు. స్థానిక బాలికల పాఠశాల1లో సమస్యలు అడిగి తెలుసుకునేందుకు మంగళవారం గంగరాజు తో పాటు ఏటిడబ్ల్యూఓ .వెంకటరమణ, ఎంఈఓ .బాలాజీ సందర్శించారు. అనంతరం హెచ్ఎం విమల కుమారి, డిప్యూటీ వార్డెన్ స్వరూప రాణితో మాట్లాడారు. తరగతి గదుల్లో సందర్శించి భోజనం సదుపాయంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్లను ప్రభుత్వం నియమించక పోవడంతో విద్యార్థులకు ఆరోగ్యం సమస్య ఏర్పడినప్పుడు సకాలంలో వైద్య సేవలు అందక వారి ప్రాణాలు గాలిలో కలిసిపోయిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. తక్షణమే హెల్త్ అసిస్టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు.విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్ నాగులు, ఉప సర్పంచ్ పి. అర్జున్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

రెవెన్యూ సదస్సులకు ఏర్పాట్లు పూర్తి

-తహశీల్దార్ త్రినాథరావు

ప్రజాశక్తి-పాడేరు : ఈనెల 13వ తేదీ నుండి జనవరి 10 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని పాడేరు తహసీల్దార్ వంజంగి త్రినాదరావు తెలిపారు మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, . మండలంలోని 26 పంచాయతీల సచివాలయం పరిదిలో ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 5 గంటలకు వరకు సదస్సులు నిర్వహిస్తామన్నారు. రెవెన్యూ సదస్సులో రైతుల నుండి వినతులు స్వీకరించి భూమి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. 13న పాడేరు సచివాలయం పరిదిలో పాతపాడేరు, 14న గుత్తులపుట్టు పంచాయతీ గబ్బంగిలోను, 16 మినుములూరు సచివాలయం, వంట్లమామిడి పంచాయతీ మోదాపల్లి, 17న డోకులూరు పంచాయతీ డి. గొందూరు, మధ్యాహ్నం 2 గంటల నుండి కాడెలి, 18న ఇరడాపల్లి సచివాలయం పరిధిలో బడిమెల, 19 తుంపాడ, కిండంగి సచివాయలం మధ్యాహ్నం వంతాడపల్లి, 20న వంజంగి, 21న గుత్తులపుట్టు పంచాయతీ ముంచంగిపుట్టు, 23న సలుగు, 24న గొండెలి సచివాలయం పరిధిలో కించరు, 26న ఇరడాపల్లి, 27న ఐనాడ, 28న లగిశపల్లి, 30న చింతలవీధి, 31న గొండెలి, జనవరి 2న దేవాపురం, 3న డోకులూరు, 4న పనుగుపల్లి, 6న గుత్తులపుట్టు, 7న కుజ్జెలి, 8న బరిసింగి, 9న కిండంగి, 10వ తేదీన వంట్లమామిడి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.



భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం ఏజెన్సీలోని 7 మండలాల పరిధిలో భూ సమస్యల పరిష్కారానికి రెవిన్యూ సదస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో అన్ని మండలాలకు సంబంధించిన తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, ఆర్ఐలు, మండల, గ్రామ సర్వేయర్లు, విఆర్ఓలకు రెవెన్యూ సదస్సులపై శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలోని 1/70 చట్టం నిబంధనలు అనుసరించి గిరిజన సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. రేషన్ బియ్యం కొన్న వారిపై కేసులు పెట్టాలని, అమ్మిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ నుండి 2025 జనవరి 8వ తేదీ వరకు రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెవిన్యూ సదస్సులు నిర్వహించే గ్రామాలలో రెండు రోజులకు ముందుగానే ఆయా గ్రామ ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎక్కువమంది ప్రజలు గ్రామసభకు వచ్చే విధంగా గిరిజనులకు అవగాహన కల్పించాలని సూచించారు. చట్టం ప్రకారం ఏజెన్సీలోని భూములపై గిరిజనులకు మాత్రమే హక్కులు ఉంటాయని స్పష్టం చేశారు. విఆర్ఓలు గిరిజనులకు అందుబాటులో ఉంటూ వారికి న్యాయం చేయాలన్నారు. బ్యాంకు మేనేజర్లకు రెవెన్యూ సదస్సుల గురించి తెలియపరచాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూములకు సంబంధించిన వివరాలు రెవిన్యూ సదస్సులో డిస్ ప్లే చేయాలన్నారు. భూ సమస్యలపై వచ్చే దరఖాస్తులన్నీ అప్లోడ్ చేయాలని, దరఖాస్తులకు రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డుతో దరఖాస్తులు సమర్పించాలన్నారు. రెవిన్యూ సదస్సుల దరఖాస్తులను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు రామకృష్ణ, వేణుగోపాల్, సిహెచ్ శ్రీనివాసరావు, కరక సత్యనారాయణ, కె.సూర్యనారాయణ, ఏఎస్‌వి సత్యనారాయణ, బాలాజీ, డిప్యూటీ తహశీల్దార్లు, ఆర్ఐలు, మండల సర్వేయర్లు, సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ సింహాచలం, చిత్రంలో సబ్ కలెక్టర్ కల్పశ్రీ

13 నుండి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఈనెల13 నుండి జనవరి 8 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దారు అల్లు సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని 19 పంచాయతీలో ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరక, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. రెవెన్యూ సదస్సులకు ప్రతి ఒక్కరు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

రెవెన్యూ సదస్సుల షెడ్యూల్

డిసెంబర్ 13న గడువోకుర్తి, దోనెలపాలెం, గొబ్బిలమడుగు, వాతంగి పంచాయతీల గ్రామాలు, 16న జి కొత్తపల్లి, వంచంగి, లాగరాయి, 17న వోగిపాలెం, వొకుర్తి, కింద్ర పంచాయతీ అనంతగిరి, ముంజువరపాడు, 18న అమీనాబాద్, కరుదేవపాలెం, కొండ లింగంపర్తి, 19న బలిజపాడు, మారేడు బాక,బోణంగిపాలెం, గడువోకుర్తి, 20న రేవటి పాలెం, కొమరాపురం, గింజర్తి, సింగంపల్లి, 21న అప్పన్నపాలెం, వనక రాయి, జడ్డంగి, 23న కింద్ర పంచాయతీ జీలుగులపాడు, చికిలింత, పెదగ ద్రంగి, 24న శరభవరం, దూసరపాము, 26న ఎర్రంపాడు, బోర్నగూడెం, చెరుకుంపాలెం, 27న దాక రాయి, కొండపల్లి, మర్రిపాలెం, వెలగలపాలెం, 28న కేశవరం, లోదొడ్డి, కింద్ర, దామన్నపాలెం, కిర్రాబు, సూరంపాలెం, 30న జి శరభవరం, ఉర్లాకులపాడు, లబ్బర్తి, నెల్లిమెట్ల, 31న పాకవెల్లి, పూదేడు, జనవరి 2న డి.మల్లవరం, తంటికొండ, 3న అమ్మిరేకుల, కిమ్మల గడ్డ, 4న ముర్ల వానిపాలెం, వైయేడు, 6న బడదనాంపల్లి, చిన్నరె ల్లంగిపాడు, 7న రాజవమ్మంగి, బోయపాడు, బొడ్ల గొంది గ్రామాలలో రెవెన్యూ గ్రామ సదస్సులు జరుగునున్నట్లు ఆయన తెలిపారు.

సిఆర్‌టిల డిప్యూటేషన్‌ను ఉపసంహరించుకోవాలి : లోతా

ప్రజాశక్తి- రంపచోడవరం : గిరిజన ప్రాంతంలోని సిఆర్‌టి ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో గురుకులాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమను రెగ్యులర్ చేయాలని, లేదంటే సిఆర్‌టిలుగా గుర్తించాలని, త్వరలో ప్రకటించనున్న మెగా డీఎస్సీలో సిఆర్‌టిల పోస్టులను కలపొద్దని 24 రోజులుగా సమ్మె చేస్తుంటే, వాటిని పరిష్కరించకపోగా, వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ ఏజెన్సీలోని గిరిజన సిఆర్‌టిలను మైదాన ప్రాంతాలకు డిప్యూటేషన్ చేయడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1400 మంది నిరసన తెలుపుతుంటే, మరోపక్క విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతుంటే ప్రభుత్వం పట్టీపట్టినట్టు వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. ఈ పోటీ ప్రపంచంలో ఒక్క గంట నష్టపోయినా విద్యార్థులకు ఎంతో నష్టం జరుగుతుంటే, 24 రోజులుగా చదువులు లేకుండా పిల్లలు ఖాళీగా ఉంటే ఏ విధంగా ఈ ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటుందని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే ఈ డిప్యూటీషన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులతో నిరసనలు భారీ స్థాయిలో చేస్తామని రామారావు హెచ్చరించారు.

బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడితే చర్యలు

ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి- పాడేరు: బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పిఒ అభిషేక్ తెలిపారు. మంగళవారం ఎంఆర్ఎస్ పాఠశాలను సందర్శించారు. బాలకలపై అఘాయిత్యానికి పాల్పడిన ల్యాబ్ అసిస్టెంట్ అనూజ్ సింగ్ పటేల్‌ను సస్పెండ్ చేసారు. అదే విధంగా ప్రిన్సిపాల్ సి. హెచ్. ప్రభాకరరావు ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. ఈ సందర్భంగా విలేఖరులతో మాట్లాడుతూ, 2వ తేదీన అఘాయిత్యం జరిగితే 5వ తేదీ వరకు అధికారుల దృష్టికి తేలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. జిల్లా కలెక్టర్ ఎస్పీగారితో చర్చించి బాలికలపై లైంగిక వేదింపులకు పాల్పడిన అనూజ్ సింగ్ పటేల్ను అరెస్టు చేసి అతనిపై ఫోక్సో చట్టం నమోదు చేసి అరెస్టు చేసామన్నారు. ఈ సంఘటనపై జిల్లా గిరిజన సంక్షేమాధికారి నేతృత్వంలో ఐసిడిఎస్ అధికారులతో ఎంక్వైరీ కమిటీ వేయడం జరిగిందన్నారు. సమగ్రమైన విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.గత నెలలో బంధవీధి పాఠశాలలో జరిగిన సంఘటనపై ఎంపిడిఓ కార్యాలయం సిబ్బందిపై ఫోక్సో కేసు పెట్టి జైలుకి పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని, గురుకులం ప్రిన్సిపాల్ మూర్తి, సిడిపి ఓ ఝాన్సి లక్ష్మి పాల్గొన్నారు.



డోలీలో మృతదేహాన్ని తరలిస్తున్న కుటుంబ సభ్యులు

డోలీలో మృతదేహం తరలింపు

ప్రజాశక్తి- అనంతగిరి: మృతదేహాన్ని ఆరు కిలోమీటర్ల కొండకోనల నడుమ డోలీలో తరలించిన ఘటన అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ పరిది మద్రెబులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొండతలి చిలకమ్మ మృతి చెందింది. అనారోగ్యం కారణంగా కుటుంబ సభ్యులు ఈ నెల 8న డోలిలో పినకోట ఆసుపత్రికి తరలించారు. మేరుగైన వైద్యం విశాఖ కేజీఎస్ కు తరలించారు. వైద్య సేవలు పొందుతూ మంగళవారం మృతి చెందగా అంబులెన్స్‌లో దేవరాపల్లికి తరలించారు. కుటుంబ సబ్యులు అక్కడ నుండి సుమారు ఆరు కిల్లో మీటర్లు దూరం కొండల నడుమ నుండి మృతదేహాన్ని తరలించారు.

కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-హుకుంపేట: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ సంయుక్తంగా ఉప్పలో ఉచిత నేత్ర వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు.ఈ శిబిరంలో కంటివ్యాధుల రోగులకు పరీక్షలు చేసి వారిలో 42 మందికి కేటరాక్ట్ ఉన్నట్లు గుర్తించారు. జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ .విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ, హాస్పటల్ కు వెళ్లి వైద్యం చేయించుకోలేని స్తోమత లేకపోవడంతో చాలామంది ఇంట్లోనే బాధపడుతున్నారన్నారు. ఈ శిబిరంలో మెడికల్ ఆఫీసర్లు మోహన్, సాయి రెడ్డి, రేఖ, ఆప్తాల్మిక్ ఆఫీసర్ అప్పారావు పాల్గొన్నారు.



ఆసుపత్రి వద్ద కంటి రోగులు



నినాదాలు చేస్తున్న ఆదివాసీ గిరిజన మహిళా సంఘం మహిళలు

మహిళలపై దాడులు అరికట్టాలి

ప్రజాశక్తి-హుకుంపేట: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. అనంతరం ఆదివాసీ గిరిజన మహిళా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. గిరిజన మహిళా సంఘం జిల్లాకార్యదర్శి హైమావతి మాట్లాడుతూ, మహిళలపై జరుగుతున్న హింస, దాడులు, మానవ హక్కుల ఉల్లంఘన అని అన్నారు. మతోన్మాదుల పాలనలో మహిళల పరిస్థితి దిగజారిపోతుందన్నారు.. మహిళల హక్కులు, చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అరకులోయ మండలం శిరగాం పంచాయితీలో నడిమివలస, సందివలసలో మంగళవారం శారద ట్రస్టు ఆధ్వర్యంలో గిరిజనులను ఆదివాసి గిరిజన మండల నాయకులు కిండంగి రామారావు, కార్యదర్శివర్గ సభ్యులు కొర్రా మగ్గన్న రగ్గులు పంపిణీ చేసారు. పివిటిజి నిరుపేద 50 కుటుంబానికి రగ్గులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు కె.రామారావు, కార్యదర్శివర్గ కె.మగ్గన మాట్లాడుతూ, ఏజెన్సీలో చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఆదివాసి గిరిజన సంఘం,శారద ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేశామన్నారు. ఇలాంటి సేవ కార్యక్రమంలో ప్రభుత్వం ఎందుకు చేయడం లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పంచాయతీ నాయకులు జి కూర్మన్న, పాంగి నాగేష్, లక్ష్మి, స్వాతి, శాంతి, సురేష్, సన్యాసి, భారతి పాల్గొన్నారు.



రగ్గులు పంపిణి చేస్తున్న నాయకులు

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదు

పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

ప్రజాశక్తి-కొయ్యూరు

ప్రజా సమస్యలు పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాజ విశ్వేశ్వరరాజు హెచ్చరించారు. కొయ్యూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నుకోబడిన స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వార్డు సభ్యులకు గౌరవప్రదంగా ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రోటోకాల్ పాటించాలని సూచించారు. గ్రామ పంచాయితీ పరిధిలో ఏ అభివృద్ధి కార్యక్రమాలకైన వారి యొక్క తీర్మానాలు తీసుకొని, వారి ఆధీనంలోనే ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరగాలని స్పష్టం చేశారు. అంతే తప్ప ప్రజలు తిరస్కరించిన వారిని నియమావళికి విరుద్ధంగా ఆర్భాటాల కోసం అందలం ఎక్కించే అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంలో సమస్యలు చెప్పడమే తప్ప పరిష్కార దిశలో జరగటం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఎంపీపీ బడుగు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వారా నూకరాజు, ఎంపిడిఓ, ఎమ్మార్వో, వైస్ ఎంపీపీలు అప్పన వెంకట రమణ, అంబటి నూకలమ్మ, సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



మండల పరిషత్తు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-దేవీపట్నం

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని రంపచోడవరం పారా లీగల్ వాలంటీరు తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివాసి జేఏసీ, రాజమహేంద్రవరం డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన మంగళవారం జరిగిన కార్యక్రమంలో తెల్లం శేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2007లో రిట్ పిటిషన్ నెంబర్లు 17368, 17705, 18020, 19067, 19717, 27095 ఇచ్చిన ఆదేశాల మేరకు పోలవరం ముంపు గ్రామాలన్నింటికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. కాఫర్ డ్యామ్ నిర్మాణంతో నిర్వాసితుల జీవితాలు అస్తవ్యస్తమయ్యాయని, కొన్ని గ్రామాలు అధికారులు బలవంతంగా ఖాళీ చేయించారని, మరికొన్ని గ్రామాల నిర్వాసితులు ముంపు గ్రామాలు వదిలి వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారని పేర్కొన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా దేవీపట్నం గ్రామస్తులు అద్దె ఇళ్లల్లో ఉంటున్నారని, వీరికి ప్రతినెల ఇంటి అద్దె ఇస్తామని చెప్పిన అధికారులు ఇవ్వడం లేదని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి షెడ్యూల్డ్ ప్రాంత చట్టాలపై అవగాహన కల్పించాలని, పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు ఐనారపు సూర్యనారాయణ, యలగాడనాగేశ్వరరావు, అరగాటి వీరభద్రరెడ్డి, కారం రామన్న దొర, చిన్నారావు, మడకం వెంకన్న దొర, పాండవులు మద్దేటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెన్నుపాటి సేవలు మరువలేనివి

- యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) పితామహుడు చెన్నుపాటి లక్ష్మయ్య సేవల మరువలేనివని ఆ సంఘం నాయకులు శ్రీను, రమేష్, సుబ్బారావు పేర్కొన్నారు. యుటిఎఫ్ వ్యవస్థాపకులు కామ్రేడ్ చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి వేడుకలు ఎంఆర్ఎంఆర్సి కార్యాలయం వద్ద మంగళవారం యుటిఎఫ్ మండల అధ్యక్షులు పి.సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన చిత్రపటానికి యుటిఎఫ్ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులను అర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కానెం శ్రీను, సుబ్బారావు మాట్లాడుతూ చెన్నుపాటి లక్ష్మయ్య ఉపాధ్యాయుల హక్కుల కోసం అవిశ్రాంతంగా కృషి చేశారన్నారు. జిల్లా కౌన్సిలర్ బొజ్జియ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘానికి చెన్నుపాటి జవసత్వాలను కలిగించారన్నారు. జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలన్నారు. మహిళా కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ చెన్నుపాటి అడుగు జాడల్లో నడవాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు, సుబ్బారావు, బొజ్జియ్య, ఉదయ్, శ్రీను, పైడిమల్లి, రమణ, రమేష్, మూర్తి, సతీష్, రామకృష్ణ, చంద్రశేఖర్, లక్ష్మీ ప్రసన్న, వెంకటలక్ష్మి, రాధ,చిట్టిబాబు, గంగరాజు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

విద్యుదాఘాత బాధిత కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం



సాయం చెక్కును అందజేస్తున్న పిఒ అభిషేక్, జెసి అభిషేక్ గౌడ్

ప్రజాశక్తి-పాడేరు : పెదబయలు మండలం కిముడుపల్లి గ్రామంలో విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబానికి జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ రూ.3లక్షల తక్షణ ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసారు. కొర్రా మోహనరావు భార్య లక్ష్మి, పెద్ద కుమారుడు సంతోష్, కూతురు అంజలి విద్యుత్ ప్రమాదంలో సోమవారం మృతి చెందిన ఘటన విధితమే. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ రూ.3లక్షల చెక్కును అందజేసారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ. బాధితులకు ఒక్కొక్కరి రూ.5 లక్షల చొప్పున పరిహారం మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని జిల్లా కలెక్టర్ చెప్పారు. బాధిత కుటుంబానికి ముందుగా రూ.3 లక్షలు అందించామని పరిహారం విడుదలైన తరువాత రూ.12 లక్షలు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ కె పద్మలత ,పెదబయలు తహసీల్దార్ రంగారావు, మహిళా పోలీస్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-పాడేరు: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వారి కుటుంబానికి రూ. 10లక్షల ప్రభుత్వ నష్ట పరిహారం చెల్లించాలని సి.పి.ఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పెదబయలు మండలం కిముడుపల్లి పంచాయతీ గదురుపల్లి గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు విద్యుత్ షాక్‌కు గురై మరణించారన్నారు. దీనిపై అధికారులు తక్షణమే విచారణ జరిపి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని నష్టపరిహారం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

అరకులోయలో దుర్గాదేవి ప్రచార రథం



ప్రచార రథాన్ని దర్శించుకున్న వరద బ్రదర్స్ కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి- అరకులోయ: ఆదివాసీలు బెజవాడ కనకదుర్గ అమ్మవారిని స్వయంగా దర్శించుకునేందుకు వీలుగా అమ్మవారి ఆలయ నిర్వాహకులు దుర్గాదేవి అమ్మవారి ప్రచార రథాన్ని ఊరేగింపుగా గిరిజన గ్రామాలకు తీసుకువచ్చారు. దీనిలో భాగంగా మంగళవారం దుర్గాదేవి అమ్మవారి ప్రచార రథాన్ని అరకులోయ మండలంలోని ఎండపల్లివలస గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఎండపల్లి వలస టీచర్స్ కాలనీ నుంచి గంగమ్మ తల్లి ఆలయం వరకు ఊరేగించారు. ఈ సందర్భంగా గిరిజనులు అమ్మవారి ప్రచార రథానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వరద బ్రదర్స్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెజవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకులు ప్రధాన రథంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ట్రైకార్‌కు పూర్వవైభవం తెస్తా

60 శాతం రాయితీపై గిరిజనులకు రుణాలు : ట్రైకార్ ఛైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి -పాడేరు: ప్రభుత్వ పథకాలను గిరిజన పేదలకు అందించి ట్రైకార్‌కు పూర్వ వైభవం తెస్తామని ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఏజెన్సీలో పర్యటనలో భాగంగా ఐటిడిఏ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజనుల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని చెప్పారు. ఎన్ఎస్‌టి సి ఎఫ్ డిసి ద్వారా గిరిజనులకు 54 యూనిట్లు మంజూరు చేయడానికి రూ. 7కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. గిరిజన యువతకు బొలేరో, ఇన్నోవా, స్విఫ్ట్ వాహనాలకు రుణాలు అందిస్తామని చెప్పారు. 60 శాతం రాయితీపై స్వయం ఉపాధి పథకాలు మంజూరు చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. లబ్దిదారులు గతంలో తీసుకున్న రుణాలను నూరు శాతం తిరిగి చెల్లించాలని చెప్పారు. ఒబి ఎం ఎం ఎస్ రుణాలు తిరిగి పునరుద్ధరిస్తామని చెప్పారు.

పాడేరు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, గిరిజన రైతులు వ్యవసాయ యంత్రాలను మైదాన ప్రాంతం నుండి తీసుకుని వచ్చి వ్యవసాయం చేస్తున్నారన్నారు. వ్యవసాయ యంత్రాలకు గంటలు లెక్కన అద్దెలు చెల్లిస్తున్నారని అన్నారు. గిరిజన రైతులకు వ్యవసాయ యంత్రాలను ట్రైకార్ నుండి మంజూరు చేయాలని కోరారు.

జిసిసి డైరెక్టర్ పాంగి రాజారావు మాట్లాడుతూ ఏజెన్సీలో పిప్పళ్ల సాగును ప్రోత్సహించాలని అన్నారు. ట్రైకార్ నుండి గతంలో మంజూరు చేసిన యూనిట్లను రివ్యూ చేయాలని కోరారు.ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎవేంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఐటిడిఏ పరిధిలో అమలు చేస్తున్న కాఫీ, విడివికెలు, గోకుల షెడ్ల నిర్మాణాలు వన్ వికాస కేంద్రాల ఉత్పత్తులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ట్రైకార్ ఛైర్మన్ ముందుగా మోదకొండమ్మ అమ్మవారిని సందర్శించుకున్నారు. ఆలయ లాంఛనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పి. ఎం. ఆర్.సి భవనంలో ఐటిడిఏ పిఒ పుష్పగుచ్ఛం అందజేసారు. తరువాత కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ను ఛైర్మన్ మర్యాద పూర్వకంగా కలిసారు.ఈ సమావేశంలో బిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు, కూడ కృష్ణారావు, ఎస్.లావణ్య, అనూరాధ, గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇలు కె. వేణుగోపాల్, జి.డేవిడ్ రాజు, ఐటిడిఏ పరిపాలనాధికారి ఎం.హేమలత, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ జవహర్ కుమార్ తదతరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ డెలివరీల్లో మోసం

- బుక్ చేయకుండానే ఇంటికి వస్తువులు
- అక్రమాలపై ప్రశ్నిస్తే నిర్లక్ష్యపు సమాధానం
- ఆటోనగర్ ఇన్‌స్టాకార్ట్ సర్వీసెస్ నిర్వాకం
- లబోదిబోమంటున్న బాధితురాలు



వినియోగదారులతో నిర్లక్ష్యంగా మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధి

ప్రజాశక్తి -గాజువాక : బుక్ చేయకుండానే ఇంటికి ఏవేవో వస్తువులను డెలివరీ చేసి, బలవంతంగా డబ్బులు వసూలుచేసి, తీరా మోసాన్ని గుర్తించి ప్రశ్నిస్తే నిర్లక్ష్యపు సమాధానం.. ఇదీ గాజువాక ఆటోనగర్‌లోని ఇన్‌స్టాకార్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వాకం. దీనికి సంబంధించిన వివరాలివి.

గాజువాక శ్రీనగర్ నక్షత్ర టవర్‌లో నివాసముంటున్న వనజారావు అనే మహిళకు ఈనెల 9 ఆన్‌లైన్‌లో డెలివరీ వచ్చింది. తాను బుక్ చేయకుండానే వస్తువులు రావడమేంటని అనుమానం వ్యక్తం చేసిన ఆమె, దానిపై ఇన్‌స్టా కార్ట్ సర్వీసెస్‌కు చెందిన డెలివరీ బాయ్‌ను ప్రశ్నించగా, తెలిసిన వారెవరో బుక్ చేసి ఉంటారని చెప్పి తొందర చేయడంతో అయిష్టంగానే ఫోనుపేలో రూ.1018 చెల్లించి పార్శిల్ తీసుకున్నారు. తెరిచి చూసేసరికి డబ్బులకు సరిపడా వస్తువులు లేకపోవడంతోపాటు బుకింగ్‌తో తమకు సంబంధం లేదని గుర్తించి, మంగళవారం ఆటోనగర్‌లోని డెలివరీ సంస్థ కార్యాలయానికి వెళ్లి దీనిపై ఫిర్యాదు చేశారు. అక్కడున్న వ్యక్తి ఎక్కడినుంచి వచ్చాయో తమకు తెలియదని, డెలివరీ చేయడమే తమ బాధ్యత అంటూ నిర్లక్ష్యంగా, దురుసుగా సమాధానం చెప్పడంతో బాధిత మహిళ అవాక్కయ్యారు. ఎక్కడి నుంచి పార్శిల్ వచ్చిందో చెప్పాలని కోరినా పొంతన లేని సమాధానం చెప్పడంతోపాటు తామేమీ చేయలేయని చెప్పడంతో లబోదిబోమన్న బాధిత మహిళ తనకు జరిగిన మోసంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ బుకింగ్‌లు, డెలివరీలు పేరుతో ప్రజలను మోసపుచ్చుతున్న ఇటువంటి వ్యవహారాలపై ప్రభుత్వం, అధికారులు, పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు

ప్రాధేయపడినా స్పందించలేదు



ఆన్‌లైన్ డెలివరీలో జరిగిన మోసంపై వివరాలు ఇవ్వాలని ప్రాధేయపడినా స్పందించలేదు. సరికదా నిర్లక్ష్యపు సమాధానంతోపాటు దాడిచేసేలా మాట్లాడారు. ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా ఉండాలంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తా.

వనజారావు, బాధితురాలు



పార్శిల్‌లో వచ్చిన వస్తువులు

తారురోడ్డు సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత చినబాబు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకువేలి మండలం బస్కి పంచాయతీ కొంత్రాయిగుడ నుండి బిజగూడ వరకు తారురోడ్డు సౌకర్యం కల్పించాలని సుంకరమెట్ట సర్పంచ్, ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు గెమ్మెల చిన్న బాబు కోరారు. మంగళవారం ఆయన కొంత్రాయిగుడ, బిజగూడ, కంజారితోట గ్రామాల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ, ప్రభుత్వం పీఎం జన్మన్ పథకం కింద పీవీటీజీ కుటుంబాలకు ఇల్లులు మంజూరు చేసిందని, ఇల్లు నిర్మాణం చేసుకోవడానికి రోడ్డు మంజూరు చేయలేదన్నారు. కొంత్రాయిగుడా, బిజగుడా గ్రామాల్లో రోడ్డు మార్గం లేకపోవడంతో ఉన్న మట్టి రోడ్డు పూర్తి గుంతలు ఏర్పడి మరమ్మత్తులకు గురికావడంతో గ్రామాల్లో ఇల్లులు మంజూరైనా లబ్ధిదారులు ఏ విదంగా నిర్మాణం చేసుకుంటారని ప్రశ్నించారు.ప్రభుత్వం పీవీటీజీ కుటుంబాలకు ఇల్లు నిర్మాణానికి ఐదు లక్షలకు పెంచాలన్నారు.ఈ గ్రామాల్లో తాగునీరు సదుపాయాలు లేవని, కుళాయి ట్యాంక్ పూర్తిగా మరమ్మత్తులకు గురైందని ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులతో వెంటనే పనులు ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక పోతంగి పంచాయతీ ఎంపిటిసి ఎం.గీత కోరారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పంచాయితీ నిధులు మంజూరైనా పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి మంజూరైన నిధులతో వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని అన్ని న్యాయస్థానాల్లో ఈనెల 14 న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయస్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్టపరిహారాలు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కారానికి వస్తాయన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, విశాఖపట్నంలో లేదా 0891 – 2560414, 2575046 ఫోన్ నెంబర్లలో, vskpdlsa@yahoo.com, dlsa.vsp@gmail.com వెబ్‌సైట్లను, భీమిలి, గాజువాక, అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం, మాడుగుల, అరకు, చింతపల్లి, పాడేరు మండల న్యాయ సేవా సంఘాలను సంప్రదించాలన్నారు.

కౌశల్ క్విజ్ పోటీల్లో విజయదుర్గ ప్రతిభ

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆన్‌లైన్‌లో జరిగిన కౌశల్ క్విజ్ పోటీల్లో జివిఎంసి రెండోవార్డు రాయిపాలెం ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని విజయదుర్గ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జె.రాధాకుమారి తెలిపారు. సైన్స్ టీచర్ బి శైలజ శిక్షణలో విద్యార్థినిప్రతిభ కనబరిచిందన్నారు. విజయదుర్గను అభినందించారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ యాదగిరీశ్వరరావు

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు స్థానిక ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో యాదగిరీశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కార్యదర్శులు రికార్డులలో లేని మనుషులను గుర్తించాలని, గ్రామాల్లో ఎవరికైనా బ్యాంక్ అకౌంట్స్ లేకపోతే వారిని గుర్తించి తక్షణం ఎకౌంట్స్ ఓపెన్ చేయించాలని సూచించారు. ఆధార్ కార్డు లేని వారిని గుర్తించి తక్షణం చేయించాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేయాలని, రికార్డులు సక్రంగా నిర్వహించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలు పంచాయతీలకు చెందిన కార్యదర్శులు పాల్గొన్నారు.

పోడు భూముల్లో వెదురు ప్లాంటేషన్‌కు చర్యలు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని అటవీ హక్కుల చట్టం ద్వారా పట్టాలు పొందిన రైతుల భూములలో వెదురు ప్లాంటేషన్ సాగుకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో వై.రామవరం, మారేడుమిల్లి, రంపచోడవరం మండలాలకు సంబంధించిన తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు, సబ్ డిఎఫ్ఓలు, ఫారెస్ట్ రేంజ్ అధికారులకు వెదురు ప్లాంటేషన్ ఏర్పాటుపై హైదరాబాద్ చెందిన ఐయస్బి కన్సల్టెంట్ సత్య ప్రసన్న ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న పిఒ సింహాచలం మాట్లాడుతూ ఆర్ఒఎఫ్ఆర్ పట్టాదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా వెదురు ప్లాంటేషన్ పైలెట్ ప్రాజెక్టుగా ముందు 1000 ఎకరాలలో వెదురు ప్లాంటేషన్ వేయడం జరుగుతుందని చెప్పారు. దీనికి ఒక యాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ వెదురు ప్లాంటిసన్ నారు గతంలో ఇతర దేశాల నుంచి దిగుమతి అయ్యేదని, ఇక నుండి దేశంలోనే జార్ఖండ్ రాష్ట్రంలో వెదురు నర్సరీ నుండి వస్తుందని చెప్పారు. ఏజెన్సీలోని కమ్యూనిటీ ల్యాండ్‌లో కూడా వెదురు నర్సరీలు ఏర్పాటు చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా వెదురు ప్లాంటేషన్ వేసుకునే రైతుల భూములను గుర్తించాలని సంబంధిత అధికారులను సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్ఓలు అనూష, శ్రీనివాసులు రెడ్డి, తహశీల్దార్లు రామకృష్ణ, వేణుగోపాల్, బాలాజీ, ఫారెస్ట్ రేంజ్ అధికారులు షరీఫ్, ఏడుకొండలు, బిబి. ఏడుకొండలరావు, పి. శ్రీనివాసరావు, నానాజీ ఐయస్‌బి అల్లూరి జిల్లా కోఆర్డినేటర్ జె.నానిబాబు, మూడు మండలాల డిప్యూటీ తహశీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ కల్చరల్ ఫెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎస్ఎఫ్ఐ ఆంధ్రా యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు తలపెట్టిన కల్చరల్ ఫెస్ట్ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఎయు రిజిస్ట్రార్ ఇఎన్.ధనుంజయరావు వర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో ఈ ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఇలాంటి ఫెస్టులు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటివి దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో మరింత ఉత్సాహంగా పాల్గొనాలని ఆకాంక్షించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఎంవి.రాజు మాట్లాడుతూ ఫెస్ట్ విజయవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. తొలి రోజు జరిగిన సాంస్కృతిక ప్రదర్శనల్లో 200 మంది భాగస్వాములయ్యారు. విద్యార్థుల కళారూపాలు ఆహూతులను కట్టిపడేశాయి.

కీలక ప్రాజెక్టులకు విఎంఆర్‌డిఎ ఆమోదముద్ర

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ అథారిటీ సమావేశం మంగళవారం సాయంత్రం సిరిపురంలోని విఎంఆర్‌డిఎ కార్యాలయంలో జరిగింది. సమావేశ అనంతరం ఛైర్మన్ వి.ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ సమావేశానికి సంబంధించిన వివరాలను మీడియాకు తెలియజేశారు. యలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల్లో, నెల్లిమర్ల గ్రామ పంచాయతీలో మౌలిక వసతులు, పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. అందుకు సుమారు రూ. 9 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. సుమారు రూ.200 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం, విఎంఆర్‌డిఎ 90:10 నిష్పత్తిలో చేపట్టే కోస్టల్ ఎరోసిన్ ప్రాజెక్టుకు, మధురవాడ వద్ద ఒలింపిక్ స్టాండర్డ్‌కు అనుగుణంగా 2.7 ఎకరాల్లో క్రీడా సముదాయం నిర్మాణానికి, రుషికొండ ప్రాంతంలో పిపిపి విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో హ్యాబిటేట్ సెంటర్ నిర్మాణానికి, రుషికొండ, గంభీరం వద్ద యువత కోసం వాటర్ స్పోర్ట్స్ ప్రాజెక్టుకు, ఫార్మా సిటీలో ప్రమాదాలు జరిగిన సమయంలో వెంటనే చికిత్స అందించేందుకు వీలుగా అనకాపల్లి దగ్గర 7.68 ఎకరాలలో హెల్త్ సిటీ నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. భోగాపురం విమానాశ్రయానికి సులువుగా చేరడానికి వీలుగా 15 రహదారుల నిర్మాణానికి ఆమోదం తెలిపామన్నారు.

పోర్టు ప్రగతిలో పిఎస్‌యులు కీలకపాత్ర

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ పోర్టు ప్రగతిలో పిఎస్‌యుల పాత్ర మరువలేనిదని పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అన్నారు. పోర్ట్ భాగస్వాములు, రాష్ట్ర, జిల్లా అధికారులు, రైల్వేలు, కస్టమ్స్, ఎన్‌హెచ్ఎఐ వంటి పిఎస్‌యుల అమూల్యమైన సహకారాన్ని ఆయన ప్రశంసించారు. పోర్టు వివిధ రికార్డులను తిరగరాస్తున్న నేపథ్యంలో పోర్టు భాగస్వాముల సమావేశాన్ని మంగళవారం హోటల్ రాడిసన్ బ్లూలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు అథారిటీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి 90 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు నిర్వహణా లక్ష్యంతో నిరంతరం శ్రమిస్తూ విశేషమైన పురోగతి సాధిస్తోందన్నారు. అందులో భాగంగా 249 రోజులలోనే 55 ఎంఎంటి సరుకు నిర్వహణ చేయడం ద్వారా గత చరిత్రను తిరగరాసిందన్నారు.

ఏరివేతకేనా..?

- నిర్దేశిత ప్రాంతాల్లో పింఛన్లను తనిఖీ చేస్తున్న సర్వే బృందాలు
- నొక్కి నొక్కి ప్రశ్నలు వేస్తుండటంతో లబ్ధిదారుల్లో ఆందోళన



పురుషోత్తపురంలో పెన్షన్ల వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - యలమంచిలి, విశాఖ కలెక్టరేట్ విలేకరులు

రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్ల తనిఖీకి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో నిర్దేశించిన సచివాలయాల్లో మంగళవారం సర్వే బృందాలు రంగంలోకి దిగాయి. పింఛన్ల పంపిణీలో జరుగుతున్న అవకతవకలను వెలికితీయడానికే ఈ సర్వే అని ప్రభుత్వం బయటకు చెబుతున్నా పింఛన్ల ఏరివేతకే అన్న విషయం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలతో యలమంచిలి మండలంలోని పురుషోత్తపురం సచివాలయ పరిధి కొత్తలి, మెట్టపాలెం గ్రామాల్లోని పెన్షన్ కార్డులను సర్వే బృందాల అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. థర్డ్ పార్టీ ఉద్యోగులు ఇద్దరేసి సభ్యుల చొప్పున 10 టీములుగా ఏర్పడి ఉదయం నుండి ఈ తనిఖీలు చేపట్టారు. పురుషోత్తపురం, కొత్తలి, మెట్టపాలెం గ్రామాల్లో మొత్తం అన్ని రకాల పెన్షన్‌దారులు 491 మంది ఉన్నారు. వీరి వివరాలను ప్రత్యేక యాప్‌లో సర్వే బృందాలు నమోదు చేశాయి. పెన్షన్‌దారుల ఆధార్, తెల్ల రేషన్‌కార్డు, వికలాంగుల సదరం సర్టిఫికెట్, వితంతు పెన్షన్‌దారుల భర్త డెత్ సర్టిఫికెట్, ఒంటరి మహిళల ఫ్యామిలీ సర్టిఫికెట్ మొదలైన ఆధారాలను పరిశీలించి యాప్‌లో నిక్షిప్తం చేసుకున్నారు. డిఆర్‌డిఎ పీడీ సచీదేవి, డిఐడిఒ మంజులావాణి ఆయా గ్రామాల్లో పర్యటించారు. వారి వెంట ఎంపిడిఒ కొండలరావు, సూపరింటెండెంట్ ప్రసాదరావు ఉన్నారు. మూడు గ్రామాల్లో ఒక్కరోజులోనే సర్వే పూర్తయిందని, ఎవరు అర్హులో, ఎవరు కాదో అన్నది వారిచ్చిన ఆధారాల ప్రకారం త్వరలోనే తెలుస్తుందని ఎంపిడిఒ తెలిపారు.

ఇందిరా నగర్‌లో...

సామాజిక పింఛన్ల తనిఖీ కార్యక్రమాన్ని విశాఖ నగరంలోని జోన్ 5 పరిధిలో ఉన్న కంచరపాలెం ఇందిరా నగర్‌లో ప్రత్యేక అధికారుల బృందం చేపట్టింది. ఇందిరా నగర్ 1, 2, 3, 4, 5 వీధులు ఉండగా సోమ, మంగళవారాల్లో రెండు వీధులలో తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రాంతంలోని వార్డు సచివాలయాలకు చెందిన అధికారులు కాకుండా, పొరుగు వార్డులకు చెందిన సచివాలయ కార్యదర్శి, మరి కొంతమంది సిబ్బందితో కలిపి పింఛన్ల సర్వే కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఒక గెజిటెడ్ అధికారి స్వయంగా పర్యవేక్షించారు. సోమవారం జరిగిన తనిఖీలో 265 మంది పింఛన్లను తనిఖీ చేశారు. మంగళవారం సుమారు 300 మంది పింఛన్లను సర్వే చేశారు. ఇదే ప్రాంతంలో మరో మూడు రోజుల పాటు సర్వే ఉంటుందని సంబంధిత అధికారి తెలిపారు. ప్రభుత్వ ఆదేశం మేరకు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ 9 బృందాలను, ఒక్కొక్క బృందంలో ఐదుగురికి తగ్గకుండా అధికారులను నియమించారు. సర్వే సమయంలో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు 13 అంశాలపై పింఛన్ లబ్ధిదారులను అధికారులు వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. పింఛను లబ్ధిదారులు మూడు ఎకరాలకు మించి పల్లం భూమి, 5 ఎకరాలకు మించి మెట్టు భూమి కలిగి ఉన్నారా ? ఇంటి విద్యుత్తు 300 యూనిట్లు దాటి వస్తోందా ? కుటుంబ ఆదాయం ఎంత ? సొంత గృహం ఉందా ఉంటే దాని విస్తీర్ణం ఎంత, ఫోర్ వీలర్ వాహనం ఉందా ? అన్న విషయాలను సర్వే బృందాలు తెలుసుకుంటున్నాయి. నొక్కి నొక్కి పింఛన్‌దారులను వారు ప్రశ్నలు అడుగుతుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతినెలా తమకు అందుతున్న పింఛన్ ఇక మీదట అందుతుందా ? లేదా ? అనే సందేహాలను వ్యక్తపరుస్తున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

సచివాలయ ఎఎన్ఎంలను పిహెచ్‌సి పరిధిలోకి తేవాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : గ్రామ సచివాలయాల ఎఎన్ఎంలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోకి తేవాలని ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ చింతూరు డివిజన్ కమిటీ సహాయ కార్యదర్శి బి శశికళ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం నాయకులు మంగళవారం ఎంపీడీవోకి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం శశికళ మాట్లడుతూ గ్రామ సచివాలయం ఎఎన్ఎంల చేత గ్రామ పంచాయితీ కార్యదర్శులు, మెడికల్ డిపార్ట్మెంట్ పనులతో పాటు అదనంగా వేరే పనులు చేయిస్తున్నారని తెలిపారు. ఒకవేళ చేయకపోతే జీతాలు ఆపేస్తామంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామ సచివాలయం ఎఎన్ఎంలు కె.అమ్మాజీ, కె పార్వతి, హరిణి, భీభమ్మ, శ్రీవిద్య, రోజా పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పీహెచ్సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష ఆరోగ్య పరీక్షల్లో భాగంగా 61 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు హేమోగ్లోబిన్, హైపర్ టెన్షన్, స్కానింగ్ వంటి పరీక్షలు ఉచితంగా చేశారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి వైద్యాధికారి సుష్మ వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పద్మావతి, రమాబాయ్, లక్ష్మమ్మ, ఏఎన్ఎంలు, ఆశా, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

లోన్ యాప్ వేధింపులకు యువకుడు బలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో మరో దారుణం చోటు చేసుకుంది. లోన్ యాప్ వేధింపులకు మరో యువకుడు బలైపోయాడు. పెళ్లైన 40 రోజులకే అతడు ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర విషాదం నింపింది. వాట్సాప్‌లో మార్ఫింగ్ చేసిన ఫొటోను చూసి కలత చెందిన సదరు యువకుడు ప్రాణాలు తీసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. మహారాణిపేట అంగటిదిబ్బ ప్రాంతానికి చెందిన నరేంద్ర (22)కు అక్టోబర్ 20న వివాహమైంది. ఆయన ఓ లోన్ యాప్ నుంచి రెండు వేల రూపాయల రుణం తీసుకున్నాడు. దాన్ని సకాలంలో చెల్లించలేదని లోన్ యాప్ గ్యాంగ్ నరేంద్ర ఫొటోను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి బెదిరింపులకు దిగింది. అక్కడితో ఆగకుండా ఆ ఫొటోను ఆయన భార్యకు, స్నేహితులకు, బంధువులకు లోన్ యాప్ నిర్వాహకులు వాట్సాప్ ద్వారా పంపారు. దీంతో నరేంద్ర తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై ఎంఆర్.పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేతన ఒప్పందం అమలు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని, నాలుగు సంవత్సరాల బోనస్ బకాయిలు చెల్లించాలని, పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విశాఖ పోర్టు ఎఒబి ఎదుట విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చేసిన వేతన ఒప్పందం అమలు చేయకపోవడం గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. మోడీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తూ కాలయాపన చేస్తోందన్నారు. విశాఖపట్నం పోర్టుకు ఈ ఏడాది రూ.725 కోట్లు లాభాలు వచ్చాయని, దానికి కార్మికుల శ్రమశక్తే కారణమని అన్నారు. అటువంటి కార్మికులకు అగ్రిమెంట్ అయిన వేతనాలను అమలు చేయకపోవడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. బోనస్ సమస్యను పరిష్కరించాలన్నారు. పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటీకరించవద్దని అన్ని యూనియన్లు కోరుకుంటున్నా అందుకు విరుద్ధంగా యాజమాన్యం వ్యవహరించడం దారుణమన్నారు.